ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 88 | సోమవారం 01, డిసెంబర్ 2025 | పేజీలు: 05 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com



# విజన్ 2047 డాక్యుమెంట్ విడుదల

సంపద పెంచుతాం.. ప్రజలకు పంచుతాం
ఇదే కాంగ్రెస్ పప్రభుత్వ ప్రధాన లక్ష్యం
హైదరాబాద్ ను కాలుష్య
రహిత నగరం చేస్తాం
రాష్ట్ర అభివృద్ధిలో రైతులను
భాగస్వాములను చేస్తాం
రాష్ట్రానికి మరో నాలుగు
ఎయిర్ పోర్టులు తీసుకొస్తాం
వరంగల్ విమనాశ్రయాన్ని
అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి


**హైదరాబాద్, ప్రజాస్వరం**

రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన 'తెలంగాణ రైజింగ్-విజన్ డాక్యుమెంట్ 2047' ను ప్రభుత్వం ప్రజలకు అంకితం చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సచివాలయంలో మంత్రులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం కీలక ప్రకటనలు చేశారు. గత అనుభవాల నుంచి నేర్చుకున్న పాఠాలు, రాష్ట్ర ప్రజల అభిప్రాయాలు, నిపుణుల సూచనలను సమీకరించి ఈ విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు తెలిపారు. అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా సాగాలంటే పాలసీలు పారదర్శకంగా ఉండాలని, పాలసీలలో పెరాలసిస్ ఏర్పడితే పెట్టుబడులు తగ్గే ప్రమాదం ఉంటుందని సీఎం చెప్పారు. ఈ డాక్యుమెంట్ రూపకల్పనలో ఐఎస్‌బీ, నీతి ఆయోగ్‌తో పాటు లక్షలాది ప్రజలు భాగస్వాములయ్యారని తెలిపారు. హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీ, కాలుష్య రహిత మహా నగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు ప్రారంభించినట్టు సీఎం పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల అభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్‌ను సర్వీస్ సెక్టార్ కేంద్రంగా మార్చే ప్రణాళిక చేపట్టినట్టు వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధిలో రైతులు కీలక భాగస్వాములని గుర్తుచేస్తూ, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే విధానాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు సీఎం తెలిపారు. అదనంగా క్యూర్, ప్యూర్, రేర్ పేర్లతో మూడు కొత్త పాలసీలను ప్రవేశ పెడుతున్నట్టు వెల్లడించారు. ఆదాయం పెంచి, పేదలకు పంచే విధానంతో బలమైన

..మిగతా 2లో

# మన యువతకు సంకల్ప బలముంది

పరిశోధన రంగంలో దూసుకుపోతున్నాం
11 ఏండ్లల్లో ఎంతో అభివృద్ధి సాధించాం
వికసిత్ భారత్ కల సాకారమవుతోంది
పుణే విద్యార్థుల డ్రోన్
ప్రయోగం నన్ను ఆకట్టుకున్నది
మన్ కీ బాత్‌లో ప్రధాని నరేంద్ర మోడీ



**హైదరాబాద్, ప్రజాస్వరం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఉదయం ఆకాశవాణి ద్వారా ప్రసారమైన 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో భారత యువత శక్తి, సంకల్పం, పట్టుదలను కొనియాడారు. "పరిశోధన రంగంలో భారత్ దూసుకుపోతోంది. ప్రపంచంలో ఏదైనా సాధించే సత్తా మనకు ఉంది" అని ఆయన ధీమాగా ప్రకటించారు. ప్రధాని మాట్లాడుతూ, గత 11 సంవత్సరాలలో విజ్ఞాన శాస్త్రం, క్రీడలు, సామాజిక సేవ, సాంస్కృతిక రంగాల్లో భారతీయ యువత అసమాన ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. విశేషంగా భారత మహిళల అంధుల క్రికెట్ జట్టు ఇటీవల ప్రపంచకప్ గెలిచి చరిత్ర సృష్టించడాన్ని ఆయన ఉదాహరణగా చూపారు. "కష్టతరమైన వాటినైనా భారత్ సాధిస్తోంది. ఇది మన యువతలోని బలమైన సంకల్పానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా,

..మిగతా 2లో



# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

రెండు బస్సుల ఢీకొనడంతో
11 మంది దుర్మరణం
40 మందికిపైగా తీవ్రమైన
గాయాలు గాయాలు
శివగంగ జిల్లా, తిరుపత్తూర్
సమీపంలో ఘటన
మృతుల కుటుంబాలకు 2 లక్షల
పరిహారం ప్రకటించిన ప్రభుత్వం

**హైదరాబాద్, ప్రజాస్వరం**

తమిళనాడులోని శివగంగ జిల్లా, తిరుపత్తూర్ సమీపంలో జాతీయ రహదారి 36పై సోమవారం (డిసెంబర్ 1, 2025) తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 11 మంది మరణించగా, 40 మందికిపైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. మదురై నుంచి రామేశ్వరం వెళుతున్న తమిళనాడు రాష్ట్ర రవాణా

..మిగతా 2లో

# జాగృతి యాత్రకు బ్రేక్

సర్పంచ్ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్
కల్వకుంట్ల కవిత కీలక నిర్ణయం
కామారెడ్డి జిల్లా పర్యటన వాయిదా

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన 'జాగృతి జనంబాట' కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో స్వల్ప మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో, ఆయా జిల్లాల్లో యాత్రను వాయిదా

..మిగతా 5లో

# రాహుల్‌కు కేటీఆర్ లేఖ

హెచ్ఐఎల్టీపీ పేరిట 5 లక్షల కోట్ల భూ కుంభకోణం
ప్రజల ఆస్తిని కాంగ్రెస్ ఏటీఎంగా మారిస్తే ఒప్పుకోం
రాహుల్ మౌనమెందుకు.. స్పందించాలని డిమాండ్

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఇవాళ (ఆదివారం) బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ పాలసీను స్వతంత్ర భారతదేశంలో అతిపెద్ద భూ

..మిగతా 2లో

# సోనియా, రాహుల్ మీద ఎఫ్ఐఆర్

నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం

మరికొందరు కాంగ్రెస్ నేతల మీద కేసులు
ఈడీ దర్యాప్తులో అనేక సంచలన విషయాలు
అగ్రనేతలకు ఇబ్బందులు తప్పవా?
రాజకీయ కక్ష సాధింపు అంటున్నా కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, ప్రజాస్వరం**



దేశ రాజధాని ఢిల్లీలోని నేషనల్ హెరాల్డ్ వ్యవహారంపై దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకున్నది. ఆర్థిక నేరాల విభాగం అడుగు ముందుకేసి కొత్త ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ ఎఫ్ఐఆర్ కాంగ్రెస్ అగ్రనేతలపై తీవ్రమైన నేరారోపణలు నమోదు కాగా, రాజకీయ రంగంలో కలకలం చెలరేగింది. సంవత్సరాల తరబడి సాగుతున్న ఆస్తుల ప్రక్రియ మొత్తం అనుమానాస్పదంగా ఉన్నదన్న అభిప్రాయం దర్యాప్తు సంస్థల్లో ఉంది. నేషనల్ హెరాల్డ్ పత్రికను వెలువరించే సంస్థ అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ ఆర్థిక

..మిగతా 2లో

# నాందేడ్‌లో పరువు హత్య

ప్రియుడి మృతదేహాన్ని
పెళ్లాడిన యువతి
కులాంతర ప్రేమను
వ్యతిరేకించిన యువతి
కుటుంబ సభ్యుల ఘాతుకం
ప్రియుడి మృతదేహానికి పసుపు
రాసి, నుదుట సిందూరం
దిద్దుకున్న ప్రియురాలు
నిందితులైన ఆరుగురిని
అరెస్ట్ చేసిన పోలీసులు





02



# చుక్కేసి చిక్కితే.. చిక్కులే !

సైబరాబాద్‌లో వీకెండ్ డ్రంక్
అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్
431మందిపై కేసులు నమోదు
చేసిన ట్రాఫిక్ పోలీసులు
బిఎసి ఆధారంగా వర్గీకరణ..
ఎవరు ఎంత మత్తులో
పట్టుబడ్డారు.?
పలువురికి జరిమానాతో
పాటు జైలు శిక్ష

02



# తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

సంస్థ (TNSTC) బస్సుతో ఎదురుగా వస్తున్న మరో ప్రభుత్వ బస్సు ఢీ కొనడంతో ఈ దురంతం సంభవించింది. ప్రమాదం ఉదయం 4:30 గంటల సమయంలో జరిగినట్టు పోలీసులు తెలిపారు. అతివేగంతో వస్తున్న రామేశ్వరం బస్సు డివైడర్‌ను ఢీకొట్టి ఎదురుమార్గంలోకి దూసుకొచ్చి మరో బస్సును ఢీకొన్నట్టు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఢీకొన్న బలం ఎంత భయానకంగా ఉందంటే రెండు బస్సులు పూర్తిగా చితికిపోయాయి. ఒక బస్సు రోడ్డు పక్కన పడి ఉండగా, మరొకటి దాదాపు 50 మీటర్ల దూరంలో కూలిపోయింది.ప్రమాద స్థలానికి చేరుకున్న స్థానికులు, రహదారిపై వస్తున్న ఇతర వాహన డ్రైవర్లు గాయపడిన ప్రయాణికులను హుటాహుటిన బయటకు తీసి, తమ వాహనాల్లోనే సమీపంలోని తిరుపత్తూర్ ప్రభుత్వ ఆసుపత్రి, శివగంగై జిల్లా ప్రధాన ఆసుపత్రి, మదురై రాజాజీ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రయత్నంలో స్థానికులు చూపిన తక్షణ సహాయం వల్ల కొందరి ప్రాణాలు కాపాడబడ్డాయని వైద్యులు తెలిపారు. గాయపడినవారిలో 8 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వారిని మదురైలోని ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. మృతుల్లో మహిళలు, పిల్లలు కూడా ఉన్నట్టు సమాచారం. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ₹2 లక్షల చొప్పున పరిహారం, తీవ్ర గాయాలైనవారికి ₹1 లక్ష, సాధారణ గాయాలైనవారికి ₹50 వేల చొప్పున ప్రకటించారు. రవాణా శాఖ మంత్రి, ఉన్నతాధికారులు ప్రమాద స్థలానికి చేరుకుని రక్షణ కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి రెండు బస్సుల డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగం, రహదారి లోపాలు, డివైడర్ ఎత్తు తక్కువగా ఉండటం వంటి అంశాలను దర్యాప్తు చేస్తున్నారు. ఈ రోడ్డు ముందుకూడా పలు ప్రమాదాలకు ప్రసిద్ధి చెందిన "బ్లాక్ స్పాట్"గా గుర్తింపబడినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఈ దురంతం తమిళనాడులో రోడ్డు భద్రత, ప్రభుత్వ బస్సుల నిర్వహణ, డ్రైవర్ శిక్షణపై మరోసారి తీవ్ర చర్చను రేకెత్తించింది.

# మన యువతకు సంకల్ప బలముంది

**మొదటిపేజీ తరువాయి**



డిజిటల్ ఇండియాతో వికసిత్ భారత్ కల సాకారమవుతుంది. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా వంటి కార్యక్రమాలు ద్వారా భారత యువత 'వికసిత్ భారత్ 2047' మహా లక్ష్యాన్ని సాధిస్తుందని ప్రధాని బలంగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు.

**పుణె విద్యార్థుల మార్స్ డ్రోన్ ప్రయోగం**

కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియో తనను ఆకర్షించిందని మోదీ చెప్పారు. పుణెకు చెందిన విద్యార్థుల బృందం అంగారక గ్రహం (మీది వాతావరణ పరిస్థితులను (తక్కువ గురుత్వాకర్షణ, సన్నని వాయుమండలం) కృత్రిమంగా సృష్టించి, డ్రోన్లను ఎగరవేయడానికి ప్రయత్నించింది. "అక్కడ జీపీఎస్ సిగ్నల్ లేనందున డ్రోన్లు మొదట నేలకూలాయి. కానీ మన విద్యార్థులు పట్టుదలతో పదేపదే ప్రయత్నించి, చివరికి డ్రోన్లను కొంత సేపు ఎగిరేలా చేశారు. ఈ సంకల్ప బలమే 2047 నాటికి భారతాన్ని వికసిత దేశంగా మారుస్తుంది" అని ప్రధాని ఉద్వేగంతో పేర్కొన్నారు.

# రాహుల్‌కు కేటీఆర్ లేఖ

**మొదటిపేజీ తరువాయి**

కుంభకోణాల్లో ఒకటని ఆరోపణలు చేశారు. అత్యంత అవినీతితో కూడుకున్న ఈ విధానం తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన, అనుమానాలు కలిగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌కు తెలుసా.. లేకపోతే కావాలని మౌనంగా ఉన్నారా అని ప్రశ్నించారు. ఈ అవినీతి కారణంగా అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలు వాటి అసలు మార్కెట్ విలువలో నామమాత్రపు ధరకే పూర్తిగా సొంతం చేసుకోవడానికి వీలు కల్పిస్తోందని అన్నారు. దీనివల్ల తెలంగాణ ప్రజలకు రూ.5 లక్షల కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కేటీఆర్ హెచ్చరించారు. హైదరాబాద్ నగరంలోని బాలానగర్, జీడిమెట్ల, సనత్‌నగర్, ఉప్పల్, మల్లాపూర్, రామచంద్రాపురం, హయత్‌నగర్ వంటి కీలక క్లస్టర్‌లలో గత ప్రభుత్వాలు సుమారు 9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని కేటాయించాయని గుర్తుచేశారు. ఈ భూములను మొదట పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, దీర్ఘకాలిక ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించడానికి రాయితీ ధరలకు ఇచ్చారని పేర్కొన్నారు కేటీఆర్. అయితే, కొత్త HILTP కింద, పారిశ్రామిక భూములను కలిగి ఉన్నవారు ఇప్పుడు ఆ భూములను వాణిజ్య లేదా నివాస జోన్‌లుగా మార్చుకోవడానికి SRO (సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం) విలువలో కేవలం 30శాతం మాత్రమే చెల్లిస్తేచాలని చెప్పుకొచ్చారు. ప్రస్తుత మార్కెట్ ధరల చాలా రెట్లు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఈ విధానం ప్రజలకు దక్కాల్సిన ఆస్తులను తక్కువ ఖర్చుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, లక్షల కోట్ల విలువైన భూమిని నామమాత్రపు ధరకు క్రమబద్ధీకరిస్తోందని తెలిపారు. వేల కోట్ల విలువైన ఆస్తుల మార్పిడికి 45 రోజుల్లో ఫాస్ట్‌ట్రాక్ ఆమోదాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయంపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. ఇంత తొందరపాటుతో కూడిన ప్రక్రియలో పారదర్శకతలేదని, కేవలం డబ్బులు దండుకోవాలనే సరైన విచారణ లేకుండానే ఈ భూములను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటుతనం, ఈ మొత్తం పాలసీలో దాగున్న రాజకీయ అవినీతి అనేక ప్రశ్నలను లేవనెత్తుతోందని ధ్వజమెత్తారు. అలాగే, రాహుల్ గాంధీకి రెండు కీలక ప్రశ్నలు సంధించారు కేటీఆర్. తెలంగాణలో పెద్దఎత్తున జరుగుతున్న అక్రమాల గురించి వెంటనే స్పందించాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న రూ.5 లక్షల కోట్ల అవినీతి స్కామ్‌ని అడ్డుకోవాలని సూచించారు. లేకపోతే దేశ చరిత్రలోనే అతిపెద్ద భారీ భూకుంభకోణంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. రాహుల్ గాంధీ స్పదించకపోతే ఈ స్కాంలో భాగస్వామ్యం ఉందని, కాంగ్రెస్ హైకమాండ్ అనుమతితోనే రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణం తెలంగాణలో జరుగుతోందని భావించాల్సి ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ ఈ అంశంలో ఇప్పటికైనా మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ భారీ అవినీతికి అడ్డుకట్ట వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తన అవినీతి కోసం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తాము ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తాను రాస్తున్న ఈ బహిరంగ లేఖకు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ హై కమాండ్ ఇచ్చే సమాధానం తెలంగాణ ప్రయోజనాలను కాపాడే విధంగా ఉండాలని కోరారు కేటీఆర్.

# సోనియా, రాహుల్ మీద ఎఫ్ఐఆర్

**మొదటిపేజీ తరువాయి**



సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు కాంగ్రెస్ పార్టీ భారీ మొత్తం సహాయం అందించింది. అప్పు పేరుతో ఇచ్చిన ఈ డబ్బు తిరిగి రాకపోవడంతో సంస్థ పూర్వవైభవం కోల్పోయింది.ఈ పరిస్థితిని ఉపయోగించుకుని కొంతమంది నాయకులుఆస్తుల నియంత్రణను పొందే ప్రయత్నంలో అడుగులు వేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. దర్యాప్తు సంస్థల అభిప్రాయం ప్రకారం అసలు ఉద్దేశం అప్పు సహాయం కాదు. లక్ష్యం విలువైన ఆస్తులపై ఆధిపత్యం సాధించడం. ఈ అభిప్రాయం ఆధారంగానే కొత్త ఎఫ్ఐఆర్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

**ఎఫ్ఐఆర్‌లో నిందితుల జాబితా**

ఎఫ్ఐఆర్‌లో ప్రధానంగా కాంగ్రెస్ ప్రముఖులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లు ఉన్నాయి. వీరితోపాటు పార్టీ సీనియర్ నేతల పేర్లు నమోదు చేశారు. గడిచిన సంవత్సరాల్లో మరణించిన మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ పేర్లు గత దర్యాప్తులో కనిపించాయి. కానీ ప్రస్తుత ఎఫ్ఐఆర్‌లో జీవి నిందితులపైనే నమోదు జరిగింది. పార్టీకి దగ్గరగా పనిచేసిన మరికొందరు కీలక వ్యక్తులు కూడా నిందితుల్లో చోటు దక్కించుకున్నారు. వారిపై ప్రధాన ఆరోపణ పెద్ద విలువైన ఆస్తులను చేజిక్కించుకునే ప్రయత్నం. ఈ ప్రయత్నం మొత్తం పథకం ప్రకారమే జరిగిందని దర్యాప్తు సంస్థ అభిప్రాయం.

**రూపాయి యాభై లక్షల చెల్లింపుతో వేల కోట్ల ఆస్తుల హక్కు**

ఈ వ్యవహారంలో ముఖ్య ఆరోపణ విలువైన ఆస్తుల హస్తాంతరణ. పత్రిక సంస్థకు ఉన్న భూములు నగరాల్లోని విలాస వసతులు తదితర ఆస్తుల మొత్తం విలువ రెండు వేల కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఇంత భారీ ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు రూపాయి యాభై లక్షల చెల్లింపు మాత్రమే చేసినట్లు ఆరోపించారు. ఎఫ్ఐఆర్ ప్రకారం ఈ మొత్తం చెల్లింపు చట్టబద్ధం కాదు. అసలు అప్పు పేరుతో ఇచ్చిన మొత్తం పార్టీ నిధుల నుంచే వెళ్ళింది. ఆ నిధుల రికవరీ పేరుతో మూడవ వ్యక్తుల పేర్లపై ఆస్తుల హక్కులు పొందే ప్రక్రియ అమలులోకి వచ్చింది. ఆ ప్రక్రియలో పత్రాల సృష్టి, షేర్ బదిలీలు, అధికార హక్కుల మార్పులు జరిగినట్లు దర్యాప్తు సంస్థలు వివరించాయి.

**ఆస్తుల నియంత్రణ లక్ష్యంగా పథకం అమలు**

దర్యాప్తు సంస్థ అభిప్రాయం ప్రకారం మొత్తం వ్యవహారం ముందుగానే రచించిన పథకం. మొదట పత్రిక సంస్థను ఆర్థికంగా బలహీనపరిచే పరిస్థితుల దిశగా నడిపించారు. అప్పు పేరుతో సహాయం అందించినట్లుగా చూపించారు. తరువాత అప్పు తీర్చలేకపోయినట్లు బోధ పర్చారు. దాని తరువాత అప్పు మొత్తాన్ని షేర్ల రూపాంతరానికి తుది నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాకే విలువైన ఆస్తులు చెప్పుకోకుండా ఇతరుల చేతికి వెళ్లే స్థితి ఏర్పడింది. ఒకప్పుడు స్వాతంత్ర్యోద్యమకాలం నుంచి పేరుప్రఖ్యాతి ఉన్న పత్రికకు చెందిన ఆస్తులు ఈ విధంగా మారిపోయాయన్న అంశం దర్యాప్తులో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది.

**వివిధ రాష్ట్రాల్లో విస్తరించిన ఆస్తుల విలువ**

అసోసియేటెడ్ జర్నల్స్ సంస్థకు ఉత్తర భారత ప్రాంతాల్లో, ముఖ్యంగా దిల్లీ, లక్నో, పట్నాలో విలువైన భూములు, భవనాలు ఉన్నాయి. ఈ భవనాలలో కొన్నింటి విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం శతకోట్లకు చేరుతుంది. ఈ ఆస్తులపై ఉన్న హక్కులు ఒక్కసారి మారితే పూర్వస్థితికి తీసుకురావడం చాలా కష్టం. దర్యాప్తు సంస్థలు అదే కారణంగా కేసును "చరిత్రాత్మక ఆస్తులపై కుట్ర"గా చూస్తున్నాయి. ఈ ఆస్తులపై ఆధిపత్యం సంపాదించడం ద్వారా రాజకీయ ఆర్థిక ప్రయోజనాలు పొందాలన్న ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**రాజకీయ రంగంలో కలకలం**

కొత్త ఎఫ్ఐఆర్ వల్ల రాజకీయ విభాగంలో తీవ్రమైన స్పందనలు వెలువడ్డాయి. కాంగ్రెస్ శ్రేణులు ఈ కేసును రాజకీయ ప్రతీకార చర్యగా పేర్కొంటున్నాయి. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు అధికార పక్షం దర్యాప్తు సంస్థల చర్యలను సమర్థిస్తోంది. చట్టపరమైన ప్రక్రియలో ఏవైనా తప్పులు జరిగినట్లు తేలితే తగిన శిక్ష తప్పదని చెప్తోంది. ఈ వ్యవహారంలో ఇప్పటికే విచారణలు సాగుతున్నాయి. పత్రాలు, ఒప్పందాలు, షేర్ బదిలీ వివరాలు, బ్యాంకు లావాదేవీలు తదితర అంశాలన్నింటినీ అధికారులు పరిశీలిస్తున్నారు. నిధుల ప్రవాహం ఎక్కడి నుంచి ఎలా జరిగిందన్న దానిపై విశేష దృష్టి పెట్టారు. ప్రతి పత్రం, ప్రతి లావాదేవీ వెనుక ఉన్న ఉద్దేశాన్ని గుర్తించేందుకు ప్రత్యేక విభాగాలు పనిచేస్తున్నాయి. అధికారుల అభిప్రాయం ప్రకారం ఈ దర్యాప్తు ఇంకా మరింత విస్తరిస్తుంది. పాత పత్రాలనుంచి తాజా లావాదేవీల దాకా అన్నింటిపై గురించి ఆధారాలు సేకరించనున్నారు. ఎవరెవరికి ఎంత లాభం కలిగిందన్న విషయంపై కూడా పూర్తి వివరాలు వెలికితీయనున్నారు.

**తదుపరి న్యాయపరమైన ప్రక్రియ**

కొత్త ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో కేసు మరో దశలోకి ప్రవేశించింది. ఎఫ్ఐఆర్ ఆధారంగా పిలుపులు పంపే అవకాశం ఉంది. సంబంధిత వ్యక్తులపై విచారణలు వేగంగా జరుగుతాయని అధికారులు తెలిపారు. సాక్ష్యాలు స్థిరీకరణ అయిన తర్వాత కోర్టులో ప్రక్రియ వేగం పుంజుకునే అవకాశం ఉంది. కేసు కొనసాగుతున్న కొద్దీ రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తతకు గురయ్యే అవకాశం ఉంది. ఈ కేసు పరిణామాలు దేశ రాజకీయ ధోరణులను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నాయి.



# విజన్ డాక్యుమెంట్ 2047 డాక్యుమెంట్ విడుదల

**మొదటిపేజీ తరువాయి**

ఆర్థిక వ్యవస్థను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. 2034 నాటికి రాష్ట్రాన్ని ఒక ట్రిలియన్, 2047 నాటికి మూడు ట్రిలియన్‌ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యాన్ని సీఎం వెల్లడించారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థకు తెలంగాణ అయిదు శాతం వంతు అందిస్తోందని, దీన్ని పది శాతానికి పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రవాణా మౌలిక వసతుల విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పేర్కొన్నారు. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయడానికి కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. అదనంగా గ్రీన్ ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ రైళ్లు, హైదరాబాద్-మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే పై కూడా కేంద్రం అంగీకరించినట్టు వెల్లడించారు. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ మెరుగుదల ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే అవకాశాలు పెరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

# చుక్కేసి చిక్కితే.. చిక్కులే !

- **సైబరాబాద్‌లో వీకెండ్ డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్**
- **431మందిపై కేసులు నమోదు చేసిన ట్రాఫిక్ పోలీసులు**
- **పలువురికి జరిమానాతో పాటు జైలు శిక్ష**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**



మద్యం మత్తులో రోడ్డు ప్రమాదాల కారణంగా.. అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైన ట్రాఫిక్ పోలీసులు, కోర్టులు కొరడా జులిపిస్తున్నాయి. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఈ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 431 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 325 ద్విచక్ర వాహనదారులు, 16 ఆటోలు, 86 కార్లు, 4 భారీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బీఏసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే.. 378 మంది 35 mg/100 ml నుంచి 200 mg/100 ml మధ్య, 42 మంది 201 mg/100 ml నుంచి 300 mg/100 ml మధ్య, 11 మంది 301 mg/100 ml నుంచి 550 mg/100 ml మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత -2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (24.11.2025-29.11.2025) లో మొత్తం 320 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 264 మందికి జరిమానా, 35 మందికి జరిమానాతో పాటు సోషల్ సర్వీస్, 21 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# నాందేడ్‌లో పరువు హత్య

- **ప్రియుడి మృతదేహాన్ని పెళ్లాడిన యువతి**
- **కులాంతర ప్రేమను వ్యతిరేకించిన యువతి కుటుంబ సభ్యుల ఘాతుకం**
- **ప్రియుడి మృతదేహానికి పసుపు రాసి, నుదుట సిందూరం దిద్దుకున్న ప్రియురాలు**
- **నిందితులైన ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**నేషనల్ బ్యూరో, ప్రజాస్వరం :**



మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగిన ఒక పరువు హత్య తీవ్ర కలకలం రేపింది. తమ కూతురిని ప్రేమిస్తున్నాడన్న కారణంతో ఓ యువకుడిని ఆమె కుటుంబ సభ్యులే అత్యంత కిరాతకంగా హత్య చేశారు. ప్రియుడి అంత్యక్రియల వద్దకు చేరుకున్న ఆ యువతి, అతని మృతదేహాన్ని పెళ్లాడి, ఇకపై అతని కుటుంబంతోనే కోడలిగా ఉంటానని శపథం చేయడం అందరినీ కదిలించింది. వివరాల్లోకి వెళితే.. నాందేడ్‌కు చెందిన సాక్షం టేటే (20), ఆంచల్ అనే యువతి గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. తన సోదరుల ద్వారా పరిచయమైన సాక్షంతో ఆంచల్‌కు సాన్నిహిత్యం పెరిగింది. అయితే వేర్వేరు కులాలు కావడంతో ఆంచల్ కుటుంబ సభ్యులు వారి పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించారు. సంబంధం మానుకోవాలని అనేకసార్లు బెదిరించారు. అయినప్పటికీ వారు తమ ప్రేమను వదులుకోలేదు. సాక్షంను పెళ్లి చేసుకోవాలని ఆంచల్ నిర్ణయించుకున్న విషయం తెలియడంతో ఆమె తండ్రి, సోదరులు గురువారం అతనిపై దాడి చేశారు. సాక్షంను తీవ్రంగా కొట్టి, తలపై తుపాకీతో కాల్చి, అనంతరం బండరాయితో తల నుజ్జునుజ్జు చేసి కిరాతకంగా హత్య చేశారు. సాక్షం అంత్యక్రియలు జరుగుతుండగా ఆంచల్ అక్కడికి చేరుకుంది. అతని మృతదేహానికి పసుపు రాసి, తన నుదుట సిందూరం దిద్దుకుంది. చనిపోయినా తన ప్రియుడినే భర్తగా స్వీకరించింది. జీవితాంతం సాక్షం ఇంట్లోనే అతని భార్యగా, వారి కోడలిగా ఉండిపోతానని నిర్ణయించుకుంది. "సాక్షం మరణంలో కూడా మా ప్రేమే గెలిచింది. మా నాన్న, సోదరులు ఓడిపోయారు. సాక్షం చనిపోయినా మా ప్రేమ బతికే ఉంది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. నిందితులకు మరణశిక్ష విధించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, హత్యకు పాల్పడిన ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక
01.12.2025
సోమవారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


## నామినేషన్ ప్రక్రియను పరిశీలించిన
# కలెక్టర్ రాహుల్ రాజ్

- **తొలి రోజు మూడు సర్పంచ్ 12 వార్డులకు నామినేషన్లు..**

**నార్సింగి నవంబర్ 30 (ప్రజా స్వరం) :**

నార్సింగి లోని ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత నామినేషన్ ప్రక్రియ కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండో విడత నామినేషన్ సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రక్రియ తూప్రాన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మనోహరాబాద్, తూప్రాన్, చేగుంట, నార్సింగి లో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మెదక్, రామాయంపేట్, శంకరంపేట్, నిజాంపేట్ మొత్తం ఎనిమిది మండలాలలో కొనసాగుతుందని అన్నారు. ఆదివారం నుంచి మొదలై మూడు రోజులపాటు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ఈ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులకు నూతన బ్యాంక్ అకౌంట్ తప్పనిసరి అని, పాత అకౌంట్లు చెల్లవని పేర్కొన్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ నామినేషన్ వేసే అభ్యర్థులు నిబంధనలను తప్పనిసరిగా ఆచరించాలని చెప్పారు. కొత్త బ్యాంక్ అకౌంట్లు తెరిచే విషయంలో అన్ని బ్యాంకుల మేనేజర్లకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. రిజర్వడ్ స్థానాలలో పోటీ చేసే అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, లేదా ఫామ్ 03 గెజిటెడ్ ఆఫీసర్స్ డిక్లరేషన్ తప్పనిసరి అని, ఎన్నికల నిబంధనలను అందరూ తప్పక పాటించాలని పేర్కొన్నారు. సర్పంచి వార్డ్ మెంబర్ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందివ్వడానికి హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేశామని అన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఎన్నికల నియమావళిని అందరూ పాటించి ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా జరపడానికి సహకరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్ బాయి, ఎంపీడీఓ ప్రీతి రెడ్డి, ఎస్ఐ సృజన, ఎంపీఓ సయీద్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా 9 గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం నామినేషన్ల స్వీకరణ తొలి రోజు మండలం నుంచి సర్పంచ్ కోసం వల్లూరు, శేరిపల్లి, జప్తి శివునూరు గ్రామాల నుంచి ఒక్కోటి మొత్తం మూడు, 80 వార్డు సభ్యుల స్థానాల కోసం మండల వ్యాప్తంగా 12 నామినేషన్లు వచ్చాయని ఎంపీడీఓ తెలిపారు.









## రెడ్డి సంఘం చెంగిచెర్ల నూతన కమిటీ ఏకగ్రీవం

**మేడిపల్లి ( ప్రజాస్వరం ) :**

చెంగిచర్ల రెడ్డి సంఘము నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం కార్యక్రమం ముగిసింది. రెడ్డి సంఘం చెంగిచర్ల ఆడక్ కమిటీ మోతే రఘు తిరుపతిరెడ్డి, చిర్ర శ్రీధర్ రెడ్డి, జితేందర్ రెడ్డి, డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, ఆధ్వర్యంలో నూతన రెడ్డి సంఘం ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షులు బొల్లపల్లి శ్రీనివాస్ రెడ్డి, కేతిరెడ్డి శశిధర్ రెడ్డి, అధ్యక్షులు బండం వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు Ch.మోహన్ రెడ్డి, R. రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి P. శేఖర్ రెడ్డి, కోశాధికారి C. రఘుపాల్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ చందర్ గౌడ్, బింగి జంగయ్య యాదవ్, కో ఆప్షన్ మెంబర్ రంగా బ్రహ్మన్న గౌడ్ నూతన కమిటీని శాలువతో సత్కరించినారు. నూతన రెడ్డి సంఘం కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం రెడ్డి సంఘం చెంగిచెర్ల కమిటీ సభ్యులు, రెడ్డి సంఘం కుటుంబ బంధువులు పాల్గొన్నారు.

## లింగాయపల్లి తాండా సర్పంచ్ పదవి ఏకగ్రీవం






- **మండలానికి ఆదర్శంగా గ్రామస్తులు**

**దౌల్తాబాద్, నవంబర్ 30 (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని లింగాయపల్లి తాండాలో గ్రామ ప్రజలు పార్టీలు వేర్వేరు అయినా గ్రామాభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని ఏకతాటిపై నిలిచారు. సర్పంచ్ పదవికి గుగులోత్ లక్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ద్వారా గ్రామస్తులు ఐక్యతకు నిదర్శనంగా నిలిచారు. అదే విధంగా లింగాయపల్లి తాండాలోని ఎనిమిది వార్డు సభ్యుల పదవులను కూడా ఏకగ్రీవం చేశారు. తరువాత జరిగిన స్థానిక విలేకరుల సమావేశంలో గ్రామ ప్రజలు, సర్పంచ్ లక్య మాట్లాడుతూ మేము చిన్నప్పటి నుంచి చదువుకున్న 'కలిసి ఉంటే కలదు సుఖం' అనే మాటను ఇప్పుడు అమలులో పెడుతున్నాం. మా గ్రామ అభివృద్ధే మా లక్ష్యం. గ్రామ పంచాయతీలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఉన్నప్పటికీ అభివృద్ధి విషయంలో అందరం ఒక్కటే. భవిష్యత్తులో కూడా ప్రతి ఎన్నికను ఇలాగే ఏకగ్రీవం చేస్తూ గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తాం అని తెలిపారు.

# ముగిసిన నామినేషన్ల పర్వం







- **మండల వ్యాప్తంగా 129 సర్పంచ్.. 492 వార్డు సభ్యుల దరఖాస్తులు**
- **ఆదివారం ఐదు గంటలలోపు తప్పుల సవరణ**

**దౌల్తాబాద్ నవంబర్ 30( ప్రజాస్వరం) :**

మండల పరిధిలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్ల దాఖలు శనివారం సాయంత్రం ఐదు గంటలతో ముగిసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనల మేరకు చివరి రోజు నామినేషన్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున అభ్యర్థులు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. గత రెండు రోజులుగా మందగించిన నామినేషన్ల పర్వం, శనివారం మధ్యాహ్నం తర్వాత ఊపందుకొని వేడెక్కింది. ఐదు గంటల గడువు లోపు కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులందరి దరఖాస్తులను అధికారులు పూర్తిస్థాయిలో స్వీకరించినట్లు తెలిపారు. అలాగే ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలకు వచ్చిన పత్రాలను కూడా స్వీకరించినట్లు స్పష్టం చేశారు. మొత్తం 129 మంది సర్పంచ్ అభ్యర్థులు, 24 గ్రామపంచాయతీలకు 492 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈసారి పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు ముందుకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దాఖలు చేసిన ప్రతి పత్రాన్ని అధికారులు వెంటనే పరిశీలించి ఆన్‌లైన్ సిస్టమ్‌లో నమోదు చేయడం ద్వారా పారదర్శకతను కాపాడుతున్నట్లు ఎన్నికల నిర్వాహకులు వెల్లడించారు. నామినేషన్ పత్రాలలో ఏవైనా వివరాల లోపాలు, పత్రాలజతలో పొరపాట్లు లేదా చిన్న తప్పులను సరిదిద్దుకునేందుకు ఆదివారం ఐదు గంటలకు అవకాశం ఉన్నందున కొంతమంది అభ్యర్థులు కౌంటర్ల వద్ద వారి వారి తప్పులను సవరణ చేసుకున్నారు.

**స్క్రూటిని పూర్తి – తుది లెక్కలు విడుదల**

సభ్యుల అభ్యర్థులలో చాలామంది రెండు రెండు సెట్లుగా నామినేషన్లు దాఖలు చేయడంతో పరిశీలన ప్రక్రియ కొంత కాల వ్యయం అయింది. ఆదివారం సాయంత్రం నాటికి అన్ని 24 గ్రామపంచాయతీలకు సంబంధించిన సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలను స్క్రూటిని చేసినట్లు అధికారులు తెలిపారు. పరిశీలన అనంతరం 107 మంది సర్పంచ్ అభ్యర్థులు, 485 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు చెల్లుబాటు అయ్యినట్లు వెల్లడించారు.

# హెచ్ఐవీ నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమం

- **2015-16లో పరీక్షించిన వారిలో 2.34% పాజిటివిటీ**
- **2024-25లో 0.58%కు తగ్గుదల**
- **గర్భిణుల్లో 0.04%కు తగ్గిన సంక్రమణ**
- **ఒక్కొక్కరి చికిత్సకు ఏడాదికి రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయం**
- **42వేల మందికి పింఛన్లు!**
- **సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా నిరంతరం అప్రమత్తం!**
- **వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడి**
- **నేడు ప్రపంచ ఎయిడ్స్ దినం**

**అమరావతి, ప్రజాస్వరం:**

హెచ్ఐవీ కేసుల నియంత్రణలో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ వెల్లడించారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో) నిర్దేశించిన 80% లక్ష్యంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ (ఏపీ శాక్స్) 76.96% సాధించిందని తెలిపారు. అలాగే సాధారణ జనాభాలో పరీక్ష వచ్చిన వారిలో హెచ్ఐవీ పాజిటివిటీ రేటు 201516లో 2.34% ఉండగా 202425 నాటికి అది 0.58%కు తగ్గిందని వెల్లడించారు. కండోమ్ వంటి సురక్షిత విధానాలపై తీసుకొచ్చిన అవగాహన వంటి చర్యలవల్ల పాజిటివిటీ తగ్గుతూ వస్తుందని పేర్కొన్నారు. 2010లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల మరణాలతో పోల్చితే 202425 నాటికి 88.72% తగ్గినట్లు న్యాకో ఇటీవల జారీచేసిన 202425 వార్షిక అంచనాల్లో పేర్కొందని శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గర్భిణుల్లో హెచ్ఐవీ పాజివిటీ రేటు 201516లో 0.10% ఉండగా 202425 నాటికి 0.04%కు తగ్గిందని చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినం (డిసెంబరు 1, సోమవారం) పురస్కరించుకుని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదివారం ప్రకటన జారీచేశారు.

**24,957 నుంచి 13,3835కు తగ్గుదల**

201516లో కొత్తగా 24,957 కేసులు, 201819లో 21,982 చొప్పున కేసులు వచ్చాయన్నారు. 202425లో కొత్త కేసులు 13,383 వచ్చినట్లు తెలిపారు. బాధితుల్లో అవగాహన కల్పించడం, ఉచితంగా మందులు ఇవ్వడం ద్వారా ఎయిడ్స్ సంబంధిత మరణాలను కూడా తగ్గించగలిగినట్లు చెప్పారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ కేసుల్లో మహారాష్ట్ర (3,62,392) తరువాత ఏపీ (2,75,528) రెండో స్థానంలో ఉంది. అయితే కొత్త కేసులు పెరగకుండా నిరోధించడంలో రాష్ట్ర ప్రభుత్వం మంచి పురోగతిని సాధిస్తోంది. మరోవైపు ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో 42,008 మంది ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారు. ఇంకొంతమంది పింఛన్ల కోసం దరఖాస్తు చేసి, ఉన్నారు. ఇవి ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

**యూఎన్ ఎయిడ్స్ లక్ష్యాల సాధనలోనూ...!**

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన లక్ష్యాల (యూఎన్ ఎయిడ్స్ 95%95%95%) మేరకు బాధితుల గుర్తింపులో, గుర్తించిన వారికి మందులు ఇప్పించడంలో, వారి శరీరంలో వైరస్ తగ్గించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పురోగతి సాధిస్తోంది. జాతీయ స్థాయిలో 81% లక్ష్యం నమోదు కాగా ఏపీ శాక్స్ 86% సాధించింది. అలాగే... వైరల్ లోడు తగ్గించడంలో జాతీయ స్థాయిలో 97% లక్ష్యం నమోదుకాగా రాష్ట్రంలో 95% వరకు నెరవేర్చింది. బాధితులకు మందులు ఇప్పించడంలో జాతీయ స్థాయి లక్ష్యం 88% కాగా ఏపీలో 87% వరకు నమోదైనట్లు ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ నీలకంఠా రెడ్డి తెలిపారు.

**అన్ని కార్యక్రమాల్లో పురోగతి**


న్యాకో వెల్లడించిన 202425 స్కోర్కార్డులో ఏపీ ప్రభుత్వం రెండోస్థానంలో ఉంది. హెచ్ఐవీ నియంత్రణకు సంబంధించిన అన్ని రకాల కార్యక్రమాల్లో పురోగతి ఉన్నట్లు న్యాకో తెలిపిందని నీలకంఠరెడ్డి పేర్కొన్నారు.

**ఒక్కొక్కరిపై రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయం**

ఒక్కో హెచ్ఐవీ కలిగిన వ్యక్తిపై ఏడాదికి ప్రభుత్వం సగటున రూ.35వేల నుంచి రూ.40వేల వరకు వ్యయంచేస్తోంది. సెంట్రల్ సెక్టార్ స్కీము కింద న్యాకో ద్వారా ఉచితంగా యాంటీ రిట్రోవైరల్ థెరపీ మందులు వస్తున్నాయి. వైరల్ లోడు (శరీరంలో హెచ్ఐవి ఇన్ఫెక్షన్ సాయి గుర్తింపు) పరీక్షలు, ఇతర వాటికి కలిపి ప్రతి నెలా ఒక్కొక్క హెచ్ఐవీ పేషంటుకు నెలకు రూ.3వేల నుంచి రూ.3,500 వరకు వ్యయమవుతోంది. ప్రతినెలా ప్రస్తుతం 2,38,760 మంది మందులను రాష్ట్ర వ్యాప్తంగా 59 ఎఆర్టీ కేంద్రాల ద్వారా పొందుతున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడుతున్న వారి జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. 2004లో మొదటి కేసు గుంటూరు నగరంలో నమోదైంది. సదరు వ్యక్తి మందులు వాడుతూ ఇప్పటికీ మెరుగైన జీవనాన్ని సాగిస్తున్నారు.

**సంపూర్ణ సురక్ష కేంద్రాల ద్వారా..!**

హైరిస్కు బిహేవియర్ (మల్టీపుల్ పార్టనర్స్) ఉండి హెచ్ఐవీ పరీక్షల్లో నెగిటివ్ వస్తున్నప్పటికీ ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తంచేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 13 'సంపూర్ణ సురక్ష కేంద్రాలు పైలటు ప్రాజెక్టు కింద 'న్యాకో' ద్వారా గత ఏడాది నుంచి నడుస్తున్నాయి. సుమారు 35వేల మందికి ఇప్పటి వరకు ఈ కేంద్రాల ద్వారా కౌన్సెలింగ్, హెచ్ఐవీ, ఇతర పరీక్షలు చేస్తున్నారు. హైరిస్క్ (సెక్స్ వర్కర్లు, స్వలింగ సంపర్కులు, ఇంజెక్టింగ్ డ్రగ్ యూజర్స్), ట్రాన్సజెండర్స్, మైగ్రంట్సు అండ్ ట్రక్కర్స్) గ్రూపులో ఉన్న వారికి ఏడాదిలో రెండుసార్లు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 109 ఎన్జీఓలు పనిచేస్తున్నాయి.










# తెలంగాణలో "అదితికి" ఆతిథ్యం

- **ఎంఎస్ఎంఈ రంగాలను ఆర్థిక బలోపేతం చేయడంలో అదితి గేంఛేంజర్**
- **జాతీయస్థాయిలో రోల్ మోడల్గా మార్చడానికి తెలంగాణ సమగ్ర రోడ్మ్యాప్**
- **మెదక్లోని ఫార్మా పరిశ్రమలు ఎంచుకున్నందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు**
- **ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికి రూ. వెయ్యి కోట్లతో అదితి అమలు**
- **రసాయనాలు, ఆహార ప్రాసెసింగ్, వస్త్రాలు వంటి ఇతర క్లస్టర్లకు విస్తరించాలని కేంద్రానికి విజ్ఞప్తి**

**హైదరాబాద్, ప్రజాస్వరం :**

లక్షలాది మందికి ఉపాధి కల్పించే మరియు నూతన ఆవిష్కరణలను తీసుకొచ్చే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటిది. ఈ రంగాన్ని బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన అసిస్టెన్స్ ఇన్ డిప్లాయింగ్ ఎనర్జీ ఎఫిషియంట్ టెక్నాలజీస్ ఇన్ ఇండస్ట్రీ లయద ఎస్టాబ్లిష్మెంట్ (అదితి)కు పూర్తి మద్దతును అందించింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ మద్దతుతో బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) అమలు చేస్తున్న ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా వేగంగా ఊపందుకుంది. నేషనల్ అదితి సిరీస్లో భాగంగా తెలంగాణ ఈ పథకాన్ని అధికారికంగా స్వాగతించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం పొందే మొదటి క్లస్టర్లలో ఒకటిగా మెదక్ జిల్లాలోని ఫార్మా పరిశ్రమను ఎంచుకున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి బీఈఈ కృతజ్ఞతలు తెలిపింది.

**సమగ్ర రోడ్ మ్యాప్తో ముందుకు**

ఈ పథకం కింద ఇంధన సామర్థ్య ప్రాజెక్టులను సమర్థవంతంగా అమలు చేయడానికి సమగ్ర రోడ్మ్యాప్ను రూపొందించాలని పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి డి శ్రీధర్ బాబు పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రవ్యాప్తంగా ఎంఎస్ఎంఈలకు నిజమైన గేమ్ఛేంజర్లుగా మారగలవని మంత్రి పేర్కొన్నారు. అదితి పథకాన్ని ప్రోత్సహించడంపై విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని బీఈఈ, ఈఈఎస్ఎల్ మీడియా సలహాదారు ఏ చంద్ర శేఖర రెడ్డి తయారుచేసిన ప్రత్యేక నివేదికను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అదితి పథకం ఎంఎస్ఎంఈలకు ఒక వరమని ప్రశంసించారు. తెలంగాణలోని అదనపు ఎంఎస్ఎంఈ క్లస్టర్లకు అదితి ప్రయోజనాలను విస్తరించాలని మంత్రి కోరారు. ముఖ్యంగా వీటిలో రసాయనాలు, ఆహార ప్రాసెసింగ్, స్టీల్ రీరోలింగ్ మరియు ఇతర రంగాలకు ఆర్థిక మరియు పర్యావరణ లాభాలను కల్పించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో తెలంగాణ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ తమ కీలకమైన పారిశ్రామిక క్లస్టర్లను ఇంధన సామర్థ్యంతో కూడినవిగా చేయడం కేవలం తక్కు ఖర్చుతో కూడుకున్నదే కాకుండా ఉత్పాదకతను పెంచుతుందని ధీమా వ్యక్తంచేశారు. తద్వారా ఎంఎస్ఎంఈలను బలోపేతం చేస్తుందని చెప్పిన ఆయన స్థిరమైన అభివృద్ధికి ఇది దోహదం చేస్తుందని చెప్పారు. అదితి అమలులో తెలంగాణ జాతీయ రోల్ మోడల్గా మారాలని తాము కోరుకుంటున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

**2035 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం**

ఈ లక్ష్యాన్ని సాధించడానికి, రాష్ట్రం జాతీయ స్థాయిలో బీఈఈ, ఈఈఎస్ఎల్, విద్యుత్, భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలులు రాష్ట్ర స్థాయిలో ఇంధన శాఖ కింద టీఎస్ రెడ్కోతో కలిసి పనిచేస్తుందని చెప్పారు. 2035 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా మార్చడానికి అన్ని వాటాదారులూ కృషి చేయాలని ముఖ్యమంత్రి ఎరేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.ఇంధన సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన వనరుల అమలు మరియు గ్లోబల్ స్టాండర్డ్స్ ఫర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్లో 24/7 విద్యుత్ సరఫరా అందించడం ఈ భారీ లక్ష్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి వివరించారు. తెలంగాణ వేగవంతమైన పారిశ్రామిక పురోగతిని ఆయన మరింతగా హైలైట్ చేశారు. రాష్ట్రం కేవలం 18 నెలల్లో రూ. 3.2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించిందని, ఇది చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిందని తెలిపారు. హైదరాబాద్ ఇప్పుడు ఆర్ అండ్ డీ, ఏఐ, డేటా సెంటర్ పెట్టుబడులలో దేశంలోని టాప్ మూడు పట్టణ ఎఫ్డీఐ గమ్యస్థానాలలో ఒకటిగా ఉందన్నారు.

**అదితి ప్రయోజనాలను మరింతగా పెంచడం..**

దేశ వ్యాప్తంగా అదితి పథకం యొక్క ప్రయోజనాలను మరింతగా పెంచడమే లక్ష్యంగా పనిచేస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని కోరుతున్నామని బీఈఈ కార్యదర్శి మిలింద్ డియోర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆన్లైన్ ద్వారా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, అన్ని రాష్ట్రాలు ఈ పథకం యొక్క ప్రయోజనాలను పెంచుకునేలా ఈ ఏడాది రూ. వెయ్యి కోట్ల నిధిని కేటాయించామన్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఇది ఎంఎస్ఎంఈ రంగంలో ఇంధన సామర్థ్యంతోపాటు పోటీతత్వాన్ని పెంపొందిస్తుందన్నారు. ఫార్మా పరిశ్రమలో గణనీయమైన సామర్థ్యం కారణంగా తెలంగాణలోని మెదక్ జిల్లా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అదితి పథకంలో పరిశ్రమలకు ఎండ్టుఎండ్ మద్దతు ఉంటుందన్నారు. ఇన్వెస్ట్మెంట్ గ్రేడ్ ఎనర్జీ ఆడిట్స్ (ఐజీఈఏ), వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్లు), ఫైనాన్సింగ్ సహాయం మరియు పర్యవేక్షణ ధృవీకరణ (ఎం అండ్ వీ) వంటి సహకారాలతో సహా మొత్తం రూ. 9 వేల కోట్లకుపైగా భవిష్యత్తులో అన్ని రాష్ట్రాలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నామన్నారు. అదితి పథకం యొక్క విజయం ఆయా రాష్ట్రాల పటిష్ట అమలుపై ఆధారపడి ఉంటుందని డియోర్ అన్నారు. ఎంఎస్ఎంఈలు ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం మరియు పర్యావరణ బాధ్యతాయుతంగా మారడానికి ఎస్డీఏలు ఈ పథకాన్ని చేరుకోవడం, హ్యాండ్హోల్డింగ్ చేయడం మరియు స్కేలింగ్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అదితి కార్యక్రమం ప్రస్తుతం 60 పారిశ్రామిక క్లస్టర్లు మరియు 14 శక్తిఇంటెన్సివ్ రంగాలలో పనిచేస్తోందని తెలిపారు. వీటిలో వస్త్రాలు, ఫౌండ్రీలు మరియు ఆహార ప్రాసెసింగ్ వంటివి ఉన్నాయని, ఈ రంగాల్లో నిర్దేశించుకున్న ఫలితాలను సాధించడానికి దశలవారీగా క్లస్టర్నిర్దిష్ట అమలు నమూనాను అనుసరిస్తున్నాయని తెలిపారు.








# జాగృతి యాత్రకు బ్రేక్

మొదటిపేజీ తరువాయి



వేస్తున్నట్లు కవిత ఆదివారం ప్రకటించారు. అక్టోబర్ 25న నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమైన ఈ యాత్ర పలు జిల్లాల్లో విజయవంతంగా కొనసాగింది. అయితే, గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా కామారెడ్డి జిల్లా పర్యటన వాయిదా పడింది. అయితే, ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో జాగృతి జనంబాట యాత్రను కొనసాగించాలని కవిత నిర్ణయించారు. డిసెంబర్ 4 నుంచి 7 వరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాత్ర ప్రారంభం కానుంది. డిసెంబర్ 10 నుంచి 14 వరకు హైదరాబాద్ జిల్లాలో యాత్ర కొనసాగనుంది. డిసెంబర్ 18, 19 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం, 21, 22 తేదీల్లో గద్వాల జిల్లాలో యాత్ర నిర్వహించనున్నారు. ఫిబ్రవరి మూడో వారం వరకు మిగిలిన పలు జిల్లాల్లో యాత్ర కొనసాగించనున్నట్లు జాగృతి నేతలు తెలిపారు.

**సీఎం పర్యటనలపై ఈసీకి ఫిర్యాదు**

సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనలపై తెలంగాణ జాగృతి రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ సొమ్ముతో సీఎం ఎన్నికల ప్రచారం కోసం ఆరు జిల్లాల్లో ప్రచార సభలు నిర్వహిస్తున్నారని కవిత ఆరోపించారు. ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదినితో ఫోన్‌లో మాట్లాడిన కవిత, ప్రజాధనం అక్రమంగా ఖర్చు చేస్తూ ఎన్నికల్లో అనుచిత లబ్ధి పొందాలని సీఎం చూస్తున్నారని వివరించారు. 'ఎన్నికలు గ్రామాల్లో ఉంటే.. జిల్లా కేంద్రాలకు వెళ్లి ముఖ్యమంత్రి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారా? ఇది ముమ్మాటికీ ఎన్నికల నిబంధనను ఉల్లంఘించటమే' అని కవిత ఎక్స్ వేదికగా విమర్శించారు. సీఎం పర్యటనలపై సీరియస్‌గా దృష్టిసారించామని ఈసీ చెప్పిందని, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనలకు కలెక్టర్లు హాజరు కాకుండా ఆదేశాలు ఇచ్చే విషయం పరిశీలిస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపినట్లు కవిత పేర్కొన్నారు. సీఎం జిల్లాల పర్యటనను వెంటనే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఆ బస్సులను పక్కకు పెట్టండి



విశాఖ, ప్రజాస్వరం :

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బస్సు ప్రమాదాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా ప్రైవేటు స్లీపర్ బస్సుల్లో భద్రతా లోపాలపై దృష్టి సారించి, నిబంధనలు పాటించని వాటిని అనుమతించవద్దని రాష్ట్రాలకు కీలక సూచనలు చేసింది. ఈమేరకు రాష్ట్రాల సీఎస్‌లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదాల్లో ప్రయాణికులు సజీవ దహనమవుతున్న ఘటనలపై పిటిషనర్లు లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ఆదేశాలు జారీ చేసినట్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక దేశవ్యాప్తంగా నిత్యం ఏదో చోట బసు ప్రమాద ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వీటిల్లో ఎక్కువ ప్రైవేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సులే ఉన్నాయి. ఈవరుస బస్సు ప్రమాదాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈక్రమంలో ప్రైవేట్ బస్సుల్లో భద్రతపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశంలోని ప్రతి రాష్ట్రానికి కీలక సూచనలు చేసింది. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను అనుమతించవద్దని.. వాటిని పక్కకు పెట్టాలని సూచించింది. ఈమేరకు ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసింది. గత కొన్ని రోజులుగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో వరుసగా బస్సు ప్రమాదాలు వెలుగు చూశాయి. అలానే మహారాష్ట్ర, రాజస్తాన్‌లలో కూడా బస్సు యాక్సిడెంట్లు వెలుగు చూశాయి. వీటిపై జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదులు అందడంతో.. ఎన్‌హెచ్‌ఆర్‌సీ వీటిపై స్పందించింది. వీటిల్లో ఓ పిటిషన్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యుడు ప్రియాంక్ కనూంగో విచారణ చేపట్టారు. మానవ హక్కుల రక్షణ చట్టం1993, సెక్షన్ 12 కింద విచారణ జరుపుతున్నారు. ఈక్రమంలో పిటిషనర్ కీలక వ్యాఖ్యలు చేశారు. దాఖలు చేసిన పిటిషన్‌లో.. ప్రైవేట్ స్లీపర్ బస్సుల రూపకల్పనలో అనేక లోపాలు ఉన్నాయి. వీటి వల్లే ఏదైనా ప్రమాదం జరిగితే.. తప్పించుకునే అవకాశం లేక ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. కొన్ని స్లీపర్ బస్సుల్లో డ్రైవర్ క్యాబిన్‌ని ప్రయాణికుల కంపార్ట్‌మెంట్ నుంచి పూర్తిగా వేరుచేయబడి ఉంటుంది. ఇలా ఉండటం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే.. డ్రైవర్ వెంటనే తప్పించుకోగలుగుతున్నాడు. కానీ ప్రయాణికులు మాత్రం బయటపడే మార్గం లేక.. బస్సుల్లోనే చిక్కుకుని.. మంటల్లో కాలి సజీవ దహనం అవుతున్నారు. అలానే ప్రయాణికులు ప్రమాదాన్ని సకాలంలో గుర్తించకుండా ఇది అడ్డంకిగా మారుతోంది అని తెలిపారు. దీంతో ప్రయాణికులు తప్పించుకోవడానికి చిన్న అవకాశం కూడా ఉండటం లేదన్నారు. ఇది ప్రాథమిక హక్కులను కాలరాయడం కిందకే వస్తుందని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం.. ఆర్టికల్ 21 ప్రతి ఒక్కరికి జీవించే ప్రాథమిక హక్కును కల్పిస్తోంది. కానీ ఇలాంటి బస్సులు ఆ హక్కును కాలరాస్తున్నాయి అంటూ మండిపడ్డారు. ఈ మధ్య కాలంలో చోటు చేసుకున్న ప్రమాద ఘటనలు.. బస్సులను తయారుచేసే కంపెనీలు, వాటి ఫిట్‌నెస్‌ను ఆమోదించే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ పిటిషన్ల నేపథ్యంలో జాతీయ మానవ హక్కుల కమిషన్.. నిబంధనలు పాటించని స్లీపర్ బస్సులను బ్యాన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# నేడు నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో స్కూళ్లకు సెలవు

- దిత్వా తుపాను కారణంగా ఏపీలో భారీ వర్షా ల హెచ్చరిక
- నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లో అప్రమత్తమైన అధికారులు
- విద్యార్థుల భద్రత దృష్ట్యా అధికారుల కీలక నిర్ణయం
- గంటకు 80 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం
- అప్రమత్తమైన విపత్తు నిర్వహణ, సహాయక బృందాలు



నెల్లూరు, ప్రజాస్వరం :

బంగాళాఖాతంలో ఏర్పడిన 'దిత్వా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని దక్షిణ ప్రాంత జిల్లాలు అప్రమత్తమయ్యాయి. భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా నెల్లూరు, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సోమవారం (డిసెంబర్ 1) సెలవు ప్రకటిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు సెలవుపై ఓ ప్రకటన విడుదల చేశారు. తుపాను కారణంగా జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు, జూనియర్ కళాశాలలకు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రతే తమకు ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, అన్నమయ్య జిల్లాలోనూ విద్యాశాఖ అధికారులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యార్థులు ఇళ్ల వద్దే సురక్షితంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిల్లలను చెరువులు, కాలువలు, నదీ పరివాహక ప్రాంతాల వైపు వెళ్లనివ్వొద్దని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విశాఖ వాతావరణ కేంద్రం అంచనాల ప్రకారం, దిత్వా తుపాను ప్రభావంతో రాయలసీమలో 10 నుంచి 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ), ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, అధికారిక ప్రకటనలను గమనించాలని అధికారులు సూచించారు.

# టెస్ట్ ఫ్లైట్‌కు సిద్ధమవుతున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం

- డిసెంబర్ చివరిలో లేదా జనవరిలో తొలి విమానం ఎగిరే అవకాశం
- ఇప్పటికే 92 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు పర్యవేక్షణతో పనుల్లో అనూహ్య వేగం
- దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా 3.8 కి.మీ. రన్‌వే నిర్మాణం

ఉత్తరాంధ్ర, ప్రజాస్వరం :



ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే 92 శాతం పనులు పూర్తి కాగా, డిసెంబర్ చివరి వారం లేదా జనవరి మొదటి వారంలో టెస్ట్ ఫ్లైట్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఈ ప్రాజెక్టు పనుల్లో అనూహ్యమైన వేగం కనిపిస్తోంది. ఆయన ప్రతి 15 రోజులకు ఒకసారి పనులను స్వయంగా పర్యవేక్షిస్తూ, గడువులోగా విమానాశ్రయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. దేశంలోనే అతి పొడవైన రన్‌వేలలో ఒకటిగా నిలిచేలా 3.8 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణం దాదాపు 99 శాతం పూర్తయింది. టెర్మినల్ భవనం 90%, ఏటీసీ టవర్ 72% పనులు పూర్తి చేసుకున్నాయి. మత్స్యాకారంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఇంటీరియర్ డిజైన్‌లో ఉత్తరాంధ్ర సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టును జీఎంఆర్ సంస్థ నిర్మిస్తుండగా, ప్రస్తుతం 5,050 మంది కార్మికులు, ఇంజనీర్లు రేయింబవళ్లు పనిచేస్తున్నారు. విభజన హామీలలో భాగంగా, గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2019లో ఈ విమానాశ్రయానికి శంకుస్థాపన చేశారు. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు మందగించాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు 'అల్లూరి సీతారామరాజు' పేరును ఖరారు చేశారు. విశాఖ పోర్టు నుంచి మూలపేట పోర్టు వరకు ప్రత్యేక కనెక్టివిటీ రహదారి, విశాఖ-భోగాపురం మధ్య మెట్రో రైలు మార్గం వంటి ప్రతిపాదనలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తయితే ఉత్తరాంధ్ర పర్యాటక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని భావిస్తున్నారు.

# మీరు కామెంట్ చేస్తే మేము పార్లమెంట్‌లో వినిపిస్తాం

- టీడీపీ ఎంపీ కొత్త ఆలోచన

ప్రజాస్వరం, ప్రజాస్వరం :



టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు వినూత్న కార్యక్రమం చేపట్టారు. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఏ అంశాలపై మాట్లాడాలనే దానిపై ఆయన నెటిజనం అభిప్రాయాలను కోరారు. కామెంట్ రూపంలో మీ అభిప్రాయాలు, ఆలోచనలు, సమస్యలను తమ దృష్టికి తెస్తే.. టీడీపీ ఎంపీలం పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామంటూ లావు శ్రీకృష్ణదేవరాయలు ట్వీట్ చేశారు. సోమవారం నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నర్సరావుపేట ఎంపీ, టీడీపీ పార్లమెంటరీపార్టీ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలుఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మీ సమస్యలు, ఆలోచనలు ఏవైనా ఉంటే మాకు చెప్పండి.. మేము పార్లమెంటులో వినిపిస్తామంటూ సోషల్ మీడియా ద్వారా పిలుపు నిచ్చారు. కామెంట్ సెక్షన్‌లో మీ సమస్యలు, ఆలోచనలు చెప్తే.. పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తామంటూ లావు శ్రీకృష్ణ దేవరాయలుట్వీట్ చేశారు. దీనికి మంచి స్పందన కూడా లభిస్తోంది. "ప్రియమైన యువ మిత్రులారా, ఆంధ్రప్రదేశ్ యువతా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా నేను, నా తోటి టీడీపీ ఎంపీలతో కలిసి, మన రాష్ట్రం, మీ భవిష్యత్తు కోసం మార్పు తీసుకురావడానికి పార్లమెంటులో లేవనెత్తాల్సిన సమస్యలు ఏమిటి? అనేది నేను మీ నుంచి వినాలనుకుంటున్నాను. తెలుగుదేశం పార్టీ సభ్యులుగామేము భాగస్వామ్య ప్రజాస్వామ్యాన్ని విశ్వసిస్తాం. అలాగే మీరు కూడా దానిలో భాగం కావాలని కోరుకుంటున్నాం. కామెంట్ సెక్షన్‌లో మీ ఆలోచనలను తెలియజేయండి! జాతీయ వేదికపై ముఖ్యమైన అంశాలపై దృష్టిని ఆకర్షించడానికి కలిసి పని చేద్దాం." అంటూ లావు శ్రీకృష్ణదేవరాయలు తన అధికారిక ఎక్స్ ఖాతా నుంచి ట్వీట్ చేశారు.

# మహిళా ఉద్యోగులను వేధించడం సరికాదు

ఐరాల, ప్రజాస్వరం :

స్థానిక పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను వైద్యాధికారి రెడ్డెప్ప వేధించడం సబబు కాదని ఏపీఎన్‌జీఓ అసోసియేషన్, ప్రజా ఆరోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వద్ద మహిళా ఉద్యోగులతో కలిసి వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య మాట్లాడుతూ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను రెడ్డెప్ప వేధిస్తున్నారన్న ఫిర్యాదు శుక్రవారం డీఎంహెచ్‌ఓకు చేరిందన్నారు. దీనిపై సంఘం నాయకులతో కలిసి వారు పడుతున్న వేధింపులపై ఆరా తీశామన్నారు. ఆశా వర్కర్లను పీహెచ్‌సీలో రాత్రి పూట విధులు నిర్వర్తించాలని, సెలవు కావాలని అడిగితే సంబంధం లేని వ్యక్తికి డబ్బులు ఇచ్చి సెలవు మంజూరు చేసుకోవాలని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతి మహిళా ఉద్యోగి సమస్యపై డబ్బే ప్రధానంగా వ్యవహరిస్తున్న తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు.

# అందుబాటులోకి మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఫెసిలిటీ

విశాఖ, ప్రజాస్వరం :

విశాఖలో పార్కింగ్ సమస్యలకు చెక్ పెట్టేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా జగదాంబ కూడలిలో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల పార్కింగ్ సమస్యకు చెక్ పడనుంది. అలాగే వీఎంఆర్డీఏ భవనం సమీపంలోనూ మరో మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఫెసిలిటీ నిర్మిస్తున్నారు. జగదాంబ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోసం రూ.11 కోట్లు జీవీఎంసీ ఖర్చు చేసింది. ఆసియా ఖండంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి. అటు అనకాపల్లి నుంచి ఇటు భోగాపురం వరకూ అన్ని ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. అయితే విశాఖను మాత్రం ట్రాఫిక్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. విశాఖలో పెరుగుతున్న జనాభాకు తోడుగా వాహనాల సంఖ్య పెరగటం , మౌలిక సదుపాయాలు కొరత దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. అలాగే విశాఖ పోర్టు ప్రాంతం కావటంతో.. పోర్టు, పారిశ్రామిక ప్రాంతాల వద్ద క్రేన్లు, భారీ ట్రక్కులు తిరుగుతూ ఉంటాయి. దీంతోనూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతూ ఉంటుంది. ఇరుకైన రహదారులు, జంక్షన్లు కూడా విశాఖలో ట్రాఫిక్ సమస్యకు కారణమనే వాదన ఉంది. సిగ్నల్ సమన్వయం లేకపోవటంతో పాటుగా రింగ్ రోడ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణంలో జాప్యం కూడా కారణమేనన్న విమర్శలు ఉన్నాయి. ఇక విశాఖలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు పోలీసులు అస్త్రం యాప్ వంటి టెక్నాలజీని కూడా ఉపయోగిస్తున్నారు. కొత్త ఫ్లైఓవర్ల నిర్మాణంపై అధికారులు ఫోకస్ పెట్టారు. అయితే విశాఖవాసులను ట్రాఫిక్ సమస్యలతో పాటు మరో సమస్య కూడా వేధిస్తోంది. అదే పార్కింగ్ సమస్య. సరైన పార్కింగ్ సదుపాయాలు లేక చాలాచోట్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జగదాంబ జంక్షన్, విశాఖ కేజీహెచ్, విశాఖ కలెక్టరేట్లతో పాటుగా ఇతర గవర్నమెంట్ ఆఫీసుల వద్ద కూడా పార్కింగ్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ సమస్యకు ప్రస్తుతం కాస్త ఉపశమనం కలిగిందనే చెప్పొచ్చు. పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ రూ.11 కోట్లతో జగదాంబ జంక్షన్ వద్ద మల్టీలెవల్ కారు పార్కింగ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఇది అందుబాటులోకి వచ్చింది. ఈ మల్టీ లెవల్ కార్ పార్కింగ్‌ను ఐదు అంతస్తులతో ఏర్పాటు చేశారు. ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసి, వాహనాల పార్కింగ్ కోసం హైడ్రాలిక్ సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయం వద్ద కూడా ఇదే తరహాలో మల్టీ లెవల్ కారు పార్కింగ్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ మల్టీ లెవెల్ కార్ పార్కింగ్‌లో వాహనానికి గంటకు 40 రూపాయలు వసూలు చేస్తున్నారు. మొదటి గంటను 40 రూపాయలు.. ఆ తర్వాతి నుంచి ప్రతి గంటకూ 20 రూపాయలు చొప్పున అద్దె నిర్ణయించారు. వాహనదారుల సౌలభ్యం కోసం 3 వేల 500 రూపాయలతో నెలవారీ పార్కింగ్ పాస్ కూడా అందుబాటులోకి తెచ్చారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999